ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
సోమవారం 6 అక్టోబరు 2025 | 3



తునిలో విషాదం

- కవలలకు జన్మనిచ్చి బాలింత మృతి
- ఏరియా ఆసుపత్రిలో ఘటన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్


5

జిల్లాకు 52 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' అవార్డులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం కింద ఈ ఏడాది జిల్లాకు ప్రభుత్వం 52 అవార్డులు ప్రకటించిందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. సోమవారం మధ్యాహ్నం 3గంటలనుంచి కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామన్నారు. స్వచ్ఛ ఇండస్ట్రీస్ కింద ఒకటి, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో ఒకటి రాష్ట్ర స్థాయిఅవార్డులు వచ్చాయన్నారు. బెస్ట్‌స్వచ్ఛత గ్రీన్‌అంబాసిడర్ల విభాగంలో 5, బెస్ట్ స్వచ్ఛ త ఎన్జీవోలు విభాగంలో 3, బెస్ట్‌స్వచ్ఛత వారియర్స్‌కు 5, బెస్ట్ స్వచ్ఛత అంగన్వాడీలు 6 అవార్డులు లభించాయన్నారు. స్వచ్ఛత ప్రభుత్వ కార్యాలయాలు 3, స్వచ్ఛత గ్రామ పంచాయతీలు 5, స్వచ్ఛత ఆస్పత్రులు 3, స్వచ్ఛత హాస్టల్స్ 3, స్వచ్ఛత ఇండస్ట్రీస్ 2, స్వచ్ఛత మున్సిపాలిటీ 1, స్వచ్ఛత రైతు బజార్ 1, స్వచ్ఛత స్కూల్స్ 5, స్వచ్ఛత ఎస్‌ఎల్‌ఎఫ్‌లు 3, స్వచ్ఛత విలేజ్ ఆర్గనైజేషన్లు 5 అవార్డులు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

చెత్తతో ఆదాయం

- తడి, పొడి చెత్త సేకరణ
- ఉత్తమ పంచాయతీగా చేబ్రోలు


గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ పంచాయతీ

(గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

అక్కడ చెత్త ద్వారానే పంచాయతీకి ఆదాయం వస్తోంది. ఇంటింటా తడి, పొడి చెత్తలను సేకరించడం ద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంటోంది. కాకినాడ జిల్లాలోని ఐదు ఉత్తమ స్వచ్ఛాంధ్ర పంచాయతీల్లో గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఉత్తమ పంచాయతీ ఎంపిక కావడానికి దోహదం చేసింది. గ్రామంలో ప్రతిరోజూ ఇంటింటా చెత్త సేకరించడంతోపాటు తడి, పొడి చెత్తగా విభజించి చెత్త నుంచి సంపద తయారీకేంద్రంలో వీటితో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారు. దాన్ని గ్రామంలోని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం చేకూరుతోంది. కంపోస్టు తయారీని మరింత పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజు తెలిపారు. ఇప్పుడు గ్రామంలో రహదారులపై చెత్త కనిపించట్లేదు. అదే సమయంలో చెత్త ద్వారా ఆదాయం వస్తుండడంతో పంచాయతీ ఆర్థికంగా బలోపేతం అవుతుందని భావిస్తున్నారు.


116 ఎకరాలు కేటాయించిన రాజమహేంద్రవరంలోని బ్రిడ్జిలంక

భూ..లోకం!

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులకు 205 ఎకరాలు

పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే అడిగింది ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాలు భూములు సిద్ధం చేసింది.. ఇందులో రాజమహేంద్రవరానికి చేరువగా బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సేకరించారు.. కడియం, సీతానగరం , కాకినాడ తదితర ప్రాంతాల్లోనూ భూములు ఉండడం గమనార్హం. ఆసక్తి ఉండి ముందుకొస్తే చాలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

- పర్యాటకానికి పెద్దపీట
- భూమిని సిద్ధం చేసిన ప్రభుత్వం
- దీర్ఘకాలిక లీజుపై ఇచ్చే యోచన
- పెట్టుబడిదారులకు ఆహ్వానం
- ముందుకొస్తే భూకేటాయింపు
- ఉమ్మడి జిల్లాలో అమలు
- నాడు ఏమీ పట్టని వైసీపీ
- నేడు పట్టు వదలని కూటమి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలకు నెలవైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటక రంగాన్ని పరుగులు తీయించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గోదావరి అందాలు,సముద్ర తీరం వెంబడి అనేక సాహస జలక్రీడల నిర్వహణకు సన్నాహాలు చేస్తోన్న ప్రభుత్వం తాజాగా పర్యాటక పెట్టుబడులను భారీగా ఆహ్వానించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ పర్యాటక పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా తక్షణమే భూములు కేటాయించేలా భూ బ్యాంకు సిద్ధం చేసింది.తక్కువ ధరకే భూములు దీర్ఘకాలిక లీజులపై కేటాయించాలని నిర్ణయించింది.ఈ మేరకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాల భూములు సిద్ధం చేసింది.కాకినాడ, ఏలేశ్వరం, గోగుల్లంక, పిచ్చుకలంక,సీతానగరం, కడియపులంక తదితర అద్భుత పర్యాటక అందాలు ఉన్న ప్రాంతాల్లో భూములు కేటాయించేందుకు ఏర్పాట్లు చేసింది.రాజమండ్రిలోని బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సిద్ధం చేసింది.

కూటమి ప్రత్యేక దృష్టి

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. గోదావరిలో బోటు షికారు, కాకినాడ హోప్‌ఐలాండ్ షికారు, దిండి రిసార్ట్స్ వద్ద బోటింగ్ ఇలా దేనికీ వసతులు కల్పించక బోట్లు కేటాయించక పర్యాటక రంగం ఈసురోమంది. కాకినాడ సాగర తీరంలో యుద్ధవిమాన మ్యూజియానికి సైతం నిధులివ్వకుండా ఖాళీగా వదిలేసింది. ప్రభుత్వం మారిన తర్వాత గడచిన ఏడాదిగా ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపాయాలకు సర్కారు పెద్దపీట వేస్తోంది.నిధులు కేటాయిస్తోంది. గత ప్రభుత్వంలో ఏ మాత్రం పట్టించుకోని గోదావరి హేవలాక్ వంతెనతోపాటు చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి రూ.94.44 కోట్ల నిధులు రాబట్టి అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్‌లో శంకుస్థాపన చేసింది. గోదావరి ఇసుక తిన్నెల్లో 120 ఎకరాల్లో టెంట్‌సిటీ నిర్మాణానికి అడుగులు వేస్తోంది.ఐదేళ్లుగా నిలిచిన కాకినాడ హోప్ ఐలాండ్ పర్యాటకాన్ని ఇటీవల పునరుద్ధరించింది.కాకినాడ, రాజమహేంద్రవరం,కోనసీమ జిల్లాల్లో 18 చోట్ల అడ్వంచర్ టూరిజం ప్రోత్సహించడానికి ఆదేశాలిచ్చింది.కాలువలు, సముద్రతీరం వెంబడి సాహస జలక్రీడలు అందుబాటు లోకి తెచ్చేలా టెండర్లు పిలిచింది.ఉమ్మడి జిల్లాలో పర్యాటక పెట్టుబడులు కోట్లలో రాబట్టేందుకు వీలుగా భూబ్యాంకు సిద్ధం చేసింది.

భూములున్నదిక్కడే..

పర్యాటక ప్రాజెక్టులకు భూములు తక్షణం కేటాయించేందుకు వీలుగా కాకినాడ నగరానికి సమీపంలోని తమ్మవరంలో 12.66 ఎకరాలు భూ బ్యాంకు తయారు చేసింది. సర్వేనెంబరు 292 నుంచి 299 వరకు సముద్రానికి దగ్గర ఉన్న భూములు రకరకాల పర్యాటక ప్రాజెక్టులు ఇచ్చేందుకు సిద్ధం చేసింది. వీటిలో హోటళ్లు, రిసార్టులు, బైక్, కారు రేసింగ్‌లు, సాహస క్రీడల ప్రాజెక్టులకు కేటాయించనుంది.ఏలేశ్వరం వద్ద సర్వే నెంబరు 83/2లో 15 ఎకరాలు సిద్ధం చేసింది. ఇక్కడ రిసార్టులు,నేచర్ టూరిజం ప్రోత్సాహానికి కేటాయింపులు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సర్వే నెం బరు 799లో 9.9 ఎకరాల భూబ్యాంకు సిద్ధ మైంది. ఇక్కడా గోదావరి అందాలు వీక్షించేలా బోటింగ్ రెస్టారెంట్,అడ్వంచర్ గేమ్స్ ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపనున్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి అందా లకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో సినిమాలు చిత్రీకరణ జరిగాయి. అద్భుతమైన లోకేషన్లు ఉన్న ఈ ప్రాంతంలో సర్వేనెంబరు 327/1లో 7.5 ఎకరాల భూ బ్యాంకును అందుబాటులోకి తెచ్చారు. రిసార్టులు, హోటళ్లు, బోటింగ్, హట్‌లు, వాటర్ స్పోర్ట్స్ ఇలా ఏతరహా పర్యాటక పెట్టుబడులు పెట్టాలన్నా వీటిని కేటాయించనున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని బ్రిడ్జిలంక వద్ద ఏకంగా 116 ఎకరాల అన్ సర్వేయడ్ భూమిని సిద్ధం చేశారు. టెంట్ హౌస్‌లు, బోటింగ్, రిసార్టుల నిర్మాణానికి వీటిని కేటాయించాలని నిర్ణయించారు. కడియపులంకలో సర్వే నెంబరు 402/1లో 2.60 ఎకరాలు, కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక దీవిలో సర్వే నెంబరు 155/1లో 26 ఎకరాల భూ బ్యాంకు సిద్ధమైంది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గోగుల్లంక వద్ద సర్వే నెంబరు 759లో 13.62 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ గోదావరి అందాల వీక్షణ,కేరళ తరహాలో కొబ్బరి చెట్ల అందాలు, మండువా లోగిళ్లు పర్యాటకులను అలరించనున్నాయి. ఇక్కడ రిసార్టులు, హోటళ్ల నిర్మాణానికి భూములు కేటాయించనున్నారు.పట్టిసీమలో 168 ఎకరాలు పర్యాటక సంస్థలు, వ్యక్తులకు కేటాయించనున్నారు.వీటిని తక్కువ ధరకు దీర్ఘకాలిక లీజుపై కేటాయించనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.


అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా కడియం వద్ద ఇలా..

పిఠాపురానికి డిప్యూటీ సీఎం పండుగ కానుక

- పలువురికి ఆర్థిక సహాయం అందజేత
- పెన్షన్లు, గృహాలు మంజూరు
- ఆ కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు


పిఠాపురానికి చెందిన అక్కాచెల్లెళ్లకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం, ఇంటి పట్టా మంజూరు, గృహనిర్మాణం చేపడతామని హామీపత్రం అందించిన జనసైనికులు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సహాయం అందించడమేకాక ఇళ్లుకట్టిస్తానని హామీ పత్రాలు, పెన్షన్లు మంజూరు ద్వారా దసరా పండగనాడు ఆ కుటుంబాల్లో పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతోషం నింపారు. జనసైనికుల ద్వారా వీటిని ఆయా కుటుంబాలకు అందజేసి భరోసాగా ఉంటామని హామీ ఇప్పించారు. పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల కష్టాలు తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఏ హంగు, ఆర్భాటం లేకుండా జనసైనికులను విజయదశమి పర్వదినాన వారి ఇంటికి పంపి భరోసా కల్పించారు. అక్కడే ఆర్థిక సహాయం చెక్కులు, ఇంటి పట్టాల మంజూరు, గృహ నిర్మాణం హామీ ఉత్తర్వులు అందజేయించారు.

నెలకు రూ.10వేలు, ఇంటి పట్టా, గృహం

పిఠాపురం పట్టణానికి చెందిన శ్రీకాకుళపు మానస నాగవెంకట కుమారి, ఆమె సోదరి తల్లిదండ్రులు కోల్పోయిన విషయం పవన్ దృష్టికి రావడంతో వారికి తన జీతంనుంచి రూ.5వేల చొప్పున అందించారు. ఇకపై క్రమం తప్పకుండా ప్రతినెలా రూ.10వేలు అందజేయాలని నిర్ణయించారు. వారి కోరిక మేరకు పట్టణంలో ఇంటి పట్టా అందించారు. ప్రభుత్వం తరపున ఇల్లు మంజూరు చేయించి నిర్మించి ఇస్తామని వారికి జనసైనికుల ద్వారా భరోసా కల్పించారు. ఎల్‌ఎన్‌పురం గ్రామానికి చెందిన కొండపల్లి సువార్తరాజు, దుర్గా సతీష్ తల్లిదండ్రులను కోల్పోగా వారికి ప్రతినెలా రూ.5వేల వంతున క్రమం తప్పకుండా అందే ఏర్పాట్లు చేశారు.

చదువుకు అండగా...

పిఠాపురానికి చెందిన బోదిరెడ్డి భవానీ తండ్రిని కోల్పోయి కాకినాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకు ఆర్థికంగా కుటుంబం ఇబ్బంది పడుతోంది. ఆమెకు ఏడాది కాలానికి అవసరమైన రూ.50వేలు పంపారు. భోగాపురం గ్రామానికి చెందిన అడపా నాగేశ్వరరావు కుమార్తె ఇంటర్మీడియట్ వరకు చదివి ఆర్థిక ఇబ్బందులతో ఆపివేసింది. రాబోయే కౌన్సెలింగ్‌లో ఆమెకు సీటు ఇప్పించి చదువుకు అయ్యే పూర్తి ఖర్చు భరిస్తామని హామీఇచ్చారు. ఉప్పాడకు చెందిన నాగిడి శృతి తండ్రి మరణించగా, తల్లి మంచాన పడడంతో చదువు ఆపివేసింది. ఆమెకు పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా సీటు ఇప్పించి చేర్పించారు. కొత్తపల్లి బేబీ, ఆమె సోదరి తల్లిదండ్రులను కోల్పోయి కష్టాలు పడుతున్నారు. వారికి కొమరగిరిలో ఇంటి పట్టా మంజూరు చేయించి ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.

- చేబ్రోలుకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు బసనబోయిన సత్యకు దివ్యాంగ పింఛను రావట్లేదు. ఆమెకు పెన్షన్ మంజూరు చేయించి రూ.15వేలను జనసైనికులు, అధికారుల ద్వారా అందజేశారు. ఆమెను సమీపంలోని రెసిడెన్షియల్ పాఠశాలలోను చేర్పించారు. దుర్గాడ గ్రామానికి చెందిన కాలిబోయిన కుమారి పక్షవాతంతో బాధపడుతూ భర్త వదిలిపెట్టగా పింఛను మంజూరు చేశారు.
- నరసింగపురంగ్రామానికి చెందిన గరగపాటి కన్నారావుకు ఉచితంగా తొడ కండరాల శస్త్రచికిత్స చేయించి మందులు, ఇతర అవసరాల నిమిత్తం రూ.50వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు.విరవాడ గ్రామానికి చెందిన పెదపూడి గంగాధర దుర్గేశ్వరరావు పోలియోతో బాధపడుతున్నాడు. అతడికి చిన్న దుకాణం నడుపుకునేందుకు రూ.50వేలను జనసైనికుల ద్వారా అందజేశారు. వన్నెపూడికి చెందిన కందా వీరకనక భర్త ఫిట్స్‌తో బాధపడుతూ ఇద్దరు పిల్లలతో జీవనోపాధికి కష్టాలు పడుతోంది. ఆమెకు రూ.50వేలు అందజేశారు.
- కందరాడ గ్రామానికి చెందిన చిట్టి పార్వతి చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి అంగవైకల్యంతో బాధపడుతోంది. జిల్లా అధికారులతో మాట్లాడి ట్రైస్కూటీ మంజూరు చేయించి అందజేశారు.
- నాగులాపల్లి గ్రామానికి చెందిన జుత్తుక తాతబ్బాయి, బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పెనుపోతుల లక్ష్మి, గోరస గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సావిత్రి, పిఠాపురానికి చెందిన సయ్యద్ ఉన్నీషా బీబీలకు ఇంటి పట్టా మంజూరు చేసి భవిష్యత్తులో ఇల్లు నిర్మించి అందజేస్తామని హామీ ఇచ్చారు.


కందరాడకు చెందిన మహిళకు ట్రై స్కూటీ అందజేసిన జనసైనికులు

వలంటీర్ల విధులు చేయలేం!

- విముక్తి కల్పించాల్సిందే
- లేదంటే ఉద్యమం తీవ్రతరం
- సచివాలయ ఉద్యోగుల హెచ్చరిక



సమావేశంలో సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్రస్థాయి నాయకులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వలంటీర్ల విధుల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎండీ జానీ పాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణ,కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ హెచ్చరించారు. రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఐక్యవేదిక ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు.ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, వలంటీర్ విధుల నుంచి విముక్తి కల్పించాలని, ఆరేళ్లుగా ఒకే క్యాడర్‌లో పని చేస్తున్నందున ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ ద్వారా స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, రికార్డు అసిస్టెంట్ పేస్కేల్‌తో క్యాడర్ అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బత్తుల అంకమ్మరావు, యువ షణ్ముఖ, కేవీ.రాజేష్‌బాబు, వి.భార్గవ్ సుతేజ్, ఎస్‌కె.మహమూద్,జీవీఎస్ శ్రీనివాస్, కె.షాలెం, కృష్ణ వెస్లీ,ఆళ్ల శ్రీధర్‌రెడ్డి,బి.రోజా ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు,ఎస్‌కె మహబూబా సు భానీ, దడాల జగ్గారావు, నవకోటిజయకృష్ణ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ఉభయ గోదావరి జిల్లాల సచివాలయ ఉద్యోగులు

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను కలెక్టరేట్‌లో సోమవారంఉదయం పదిగంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు.

ముగిసిన ఏపీపీ రాత పరీక్ష

కాకినాడక్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరిగిన పరీక్షకు 272మంది అభ్యర్థులకు 212మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



కాకినాడ జడ్పీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్

చకచకా..

- కాకినాడలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటికే పలు జంక్షన్లలో దర్శనమిస్తున్న ఐలాండ్స్
- ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో పనులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ వ్యవస్థను చక్కదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీనిలోభాగంగా గతంలోఉండి మూలకు చేరిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలను మళ్లీ తీసుకొస్తున్నారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఉండేందుకు ఐలాండ్‌లను ఏర్పాటుచేశారు. త్వరలోనే సిగ్నలింగ్ వ్యవస్థను అమర్చనున్నారు. ఓ ప్రైవేటు కాంట్రాక్టు సంస్థ ఈ పనులు చేపడుతోంది.

మూడే ప్రధాన రహదారులు

కాకినాడ నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లు నగరవాసులకు నరకం చూపెడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కొందరు వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను తుంగలోకి తొక్కడమే. కాకినాడ నగరంలో మూడే ప్రధాన రహదారులుంటాయి. ఈ మూడింటినీ కలుపుతూ అడ్డురోడ్లు, జంక్షన్లు ఉంటాయి. ఈ మూడు రహదారుల్లో మెయిన్ రోడ్డు ప్రధానమైంది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి అపోలో ఆస్పత్రి జంక్షన్, జెమినిప్లాజా సెంటర్, చందనబ్రదర్స్ సెంటర్, టౌన్ హాల్ సెంటర్, మసీదు సెంటర్, గ్లాస్‌హౌస్, పట్నాల చిట్టియ్య సెంటర్, తిలక్ స్ట్రీట్ వీధి మీదుగా జగన్నాథపురం బ్రిడ్జి వరకు ఈమెయిన్‌రోడ్‌లో సింగిల్‌వేలోనే ప్రయాణించాలి. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా సినిమారోడ్, దేవాలయం వీధి ఉంటాయి. సినిమా రోడ్ జగన్నాథపురం బ్రిడ్జి పాత స్వప్న థియేటర్ మొదలు సత్యగౌరీ థియేటర్, సంతచెరువు సెంటర్, కల్పనా సెంటర్, వైఎస్సార్ బ్రిడ్జి వరకు ఈరోడ్డు ఉంటుంది. కుడివైపు దేవాలయం వీధి ఉంటుంది. అటు జగన్నాథపురం కొత్త బ్రిడ్జి మీదుగా బాలాజీచెరువు సెంటర్ వైపు వన్‌వేలో మాత్రమే ప్రయాణం సాగాలి. ప్రస్తుతం నిబంధనలు ఎవరూ పాటించటేదు. వన్‌వేలను డబుల్‌వేగా చేసేశారు. ఎదురొచ్చే వాహనాలకు అడ్డువెళ్లే వారు ఎక్కువయ్యారు.

నగరానికి అతి చేరువగా...

కాకినాడ నగర జనాభా ఐదు లక్షలపైనే. చుట్టుపక్కల గ్రామాలు నగరానికి అతి చేరువగా మారాయి.నగరంతోపాటు అచ్చంపేట, ఏపీఎస్పీ, రమణయ్యపేట, వలసపాకల, సర్పవరం, ఇంద్రపాలెం, పండూరు, చీడిగ, తూరంగి గ్రామాల నుంచి ప్రజలు సిటీలోకి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు చేస్తుంటారు. దీంతో సాయంత్రమైతే చాలు నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. వాహనాల సంఖ్య గత నాలుగైదేళ్లలో విపరీతంగా పెరిగిపోవడంతో రహదారులు ఇరుగ్గా మారిపోయాయి. వేలాదిగా వస్తోన్న వాహనాలను కంట్రోల్ చేయడం ట్రాఫిక్ పోలీసుల వల్ల కూడా సాధ్యం కావడం లేదు.

పార్కింగ్ సమస్య

నగరంలో పార్కింగ్ సమస్య నెలకొంటోంది. మెయిన్‌రోడ్డులోకి పెద్ద షాపింగ్ మాల్స్ రాకతో ఈ సమస్య మరింత జటిలమైంది. వాటి ఎదురుగా వాహనాలను రోడ్డుపైనే వాహనయజమానులు నిలిపివేస్తున్నారు. వాస్తవానికి షాపింగ్ మాల్స్ వద్దకు వచ్చేవారికి పార్కింగ్ చూపాల్సిన బాధ్యత వాళ్లదే. చాలాచోట్ల ఇలాంటి కాంప్లెక్సులవద్ద పార్కింగ్ సదుపాయం లేదు.

సిగ్నల్స్ ఏర్పాటు దిశగా..

కాకినాడ నగరంలో గతంలో పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఉండేవి. ప్రముఖ కూడళ్లలో ఇవి పనిచేసేవి. ఐదేళ్లుగా వీటి నిర్వహణ చతికిలపడింది. కూటమి ప్రభుత్వంలో ఈ ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు సంబంధించిన పనులు పలు జంక్షన్లలో జరుగుతున్నాయి. ప్రముఖ కూడళ్లతోపాటు ముఖ్యమైన జంక్షన్లలో ట్రాఫిక్ పోలీస్ ఐలాండ్స్ ఏర్పాటు పూర్తయింది. త్వరలోనే ఇంద్రపాలెం బ్రిడ్జి జంక్షన్, కలెక్టర్ ఆఫీస్, జడ్పీ సెంటర్, బాలాజీ చెరువు సెంటర్, జగన్నాథపురం, అన్నమఘాటీ సెంటర్, మున్సిబ్ జంక్షన్, టౌన్‌హాలు జంక్షన్, కల్పనాసెంటర్, డెయిరీఫామ్, భానుగుడి, పాత ఎస్పీ ఆఫీసు, నాగమల్లితోట జంక్షన్, సర్పవరం జంక్షన్, వైఎస్సార్ వారధి ఫ్లైఓవర్, కొండయ్యపాలెంలోని ముత్తావారధి జంక్షన్, సుబ్బయ్యహోటల్ జంక్షన్, మూడులైట్ల జంక్షన్ ఇలా మొత్తం 20 ముఖ్య సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నారు.



ఆకాశంలో వహ్..లయం

ఆకాశంలో మార్పు.. తర్వాత వర్షం.. అనంతరం వలయం... యానాంలో ఆదివారం మధ్యాహ్నం ఆకాశంలో వలయం ఏర్పడ్డ దశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా... - యానాం (ఆంధ్రజ్యోతి)

'జలజీవన్ మిషన్'పై నేటి నుంచి శిక్షణ తరగతులు

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్రామీణ నీటిపారుదల విభాగం ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోలకు కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో సోమవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేవీస్వీ ప్రసాదరావు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 402 మంది అధికారులకు ఈనెల 17 వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తామన్నారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో బోధన, వసతి, భోజన సదుపాయాలను ప్రిన్సిపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సూర్యనారాయణస్వామి, ఏఈఈ వెంకటసాయి రామ్, ఫ్యాకల్టీలు పర్యవేక్షించారు.

తునిలో విషాదం

ఏరియా ఆసుపత్రిలో కవలలకు జన్మనిచ్చి బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



తునిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



మరణించిన బాలింత రత్నకుమారి



ఆసుపత్రి ఎదుట బంధువులు

తుని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విషాదం జరిగింది. ఓ బాలింత పండంటి కవలలకు జన్మనివ్వగా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఆ తల్లి కొన్ని గంటల్లోనే మృతిచెందింది. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి బాలింత మృతికి కారణమయ్యారని బంధువులు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే... తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన కాపరపు రత్నకుమారి (29)నెలలు నిండడంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఆసుపత్రికి తీసుకొచ్చారు. శనివారం ఉదయమే ఆమెకు డెలివరీ అయింది. ఇద్దరు కవల మగబిడ్డలకు జన్మనిచ్చింది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది వార్డుకు తరలించారు. అయితే కొద్దిసేపటికే రత్నకుమారికి రక్తస్రావం ప్రారంభమైందని ఎన్నిసార్లు చెప్పినా వైద్యులు, సిబ్బంది కానీ పట్టించుకోలేదని బంధువులు తెలిపారు. సూపరింటిండెంట్‌కు ఫిర్యాదు చేసినా ఆమె నుంచి కనీస స్పందన లేకపోయిందని చెప్పారు. రాత్రి అత్యవసరంగా కాకినాడ తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పారని, అంబులెన్స్‌లో కాకినాడ తీసుకెళుతుంటే అన్నవరం చేరుకునే సరికి పరిస్థితి మరింత విషమించిందని అంబులెన్స్ సిబ్బంది సూచనల మేరకు మళ్లీ తుని ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చినట్టు బంధువులు తెలిపారు. అయితే అప్పటికే ఆమె మరణించిందని చెప్పకుండా ఆసుపత్రి సిబ్బంది కొద్దిసేపు చికిత్స చేసినట్టు నటించారని ఆరోపించారు. పరిస్థితి బాగోకపోతే సకాలంలో చెప్తే సరిపోయేదని, వారు పట్టించుకోకుండా బాలింత మృతికి కారణమయ్యారని బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం జరగాలని ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఏరియా ఆసుపత్రికి భారీ సంఖ్యలో మృతురాలి బంధువులు, తిమ్మాపురం గ్రామస్తులు చేరుకోవడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. బంధువుల రోదనలతో ఏరియా ఆసుపత్రి ప్రాంగణం విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డుపై బైఠాయింపు

బాలింత మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలింత బంధువులు, తిమ్మాపురం గ్రామస్తులు తుని ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై టెంట్ వేసి బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ, స్థానిక పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళన విరమించాలని వారి చెప్పే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. స్థానిక నాయకులు, ఆసుపత్రి అధికారులు బాలింత బంధువులతో పలు దఫాలు చర్చలు నిర్వహించి నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఆందోళన విరమించి బాలింత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున బాలింత మృతి చెందడంపై విచారణ చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలన్నారు. తుని ఏరియా ఆసుపత్రిలో వైద్యుల లోపాలపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ నిర్బంధం

రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో అడ్డుకున్న పోలీసులు

హైకోర్టు అనుమతి తీసుకుని వారంలో రాజయ్యపేట వెళ్తానన్న యాదవ్



హోటల్ షెల్టాన్‌లో రామచంద్రయాదవ్‌ను బయటకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో పోలీసులు నిర్బంధించారు. వివరాల్లోకి వెళితే... అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న బాధితులకు అండగా నిరసనకు పిలుపునిచ్చిన బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆదివారం నక్కపల్లి బయలు దేరి వెళ్తూ మార్గం మధ్యలో రాజమహేంద్రవరం చేరుకుని హోటల్ షెల్టాన్‌లో బసచేశారు. తిరిగి నక్కపల్లి బయలుదేరుతున్న సమయంలో జిల్లా పోలీసులు షెల్టాన్‌కు చేరుకుని నోటీసు జారీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నక్కపల్లి వెళ్లడానికి వీలులేదని పోలీసులు సూచించారు. దీంతో పోలీసులకు, రామచంద్రయాదవ్ వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిదింది. గదిలోంచి బయటకు వచ్చిన రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కరేడు, ఉదయగిరిలలో ఇదేవిధంగా పోలీసులను అడ్డం పెట్టుకుని బాధితులను అణిచివేశారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలంటే లక్షలాది ఎకరాల బీడుభూములు ఉన్నాయని, వ్యవసాయ భూములు, తీర ప్రాంతాల భూములు పరిశ్రమలకు తీసుకోవాలంటే బీసీవై పార్టీ ఊరుకోదని స్పష్టం చేశారు. నక్కపల్లిలో జరుగుతున్న దానిని స్థానికులు అడ్డుకుంటుంటే వారికి అడంగా నిలిచేందుకు తాము వెళ్తుంటే దారుణంగా నిర్బంధం విధించడం అన్యాయమన్నారు. జరిగిన సంఘటనపై అవసరమైతే కేంద్రప్రభుత్వంతో మాట్లాడతానని యాదవ్ అన్నారు. వారం రోజుల్లో హైకోర్టులో అనుమతి తీసుకుని రాజయ్యపేట గ్రామం వెళ్తానని చెప్పారు. అనంతరం ఆయన రాజమహేంద్రవరం నుంచి వెనుదిరిగారు.

ఆర్టీసీ బస్సు, మోటార్‌సైకిల్ ఢీ యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కోనసీమ జిల్లా బండారులంక శివారు సంఘటన





ప్రమాదంలో మరణించిన శేషగిరి (ఫైల్)

అమలాపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం బండారులంక శివారు చినచంద్రాపురంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపిన వివరాలివి... సమనస గ్రామానికి చెందిన లింగోలు శేషగిరి (22), చవ్వాకుల దుర్గాచరణ్‌లు ఆదివారం దుర్గాచరణ్ అమ్మమ్మ ఊరు అయిన ఈదరపల్లి వెళ్లారు. తిరిగి మోటార్‌సైకిల్‌పై అంబాజీపేట వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వస్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును ఎదురుగా మోటార్‌సైకిల్ ఢీకొంది. ఏజీ రోడ్డులో షిరిడిసాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో శేషగిరి అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్గాచరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ శేఖర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఊరేగింపులో బాణసంచా పేలి పురోహితులకు తీవ్రగాయాలు

డీజేను స్వాధీనం చేసుకున్న పోలీసులు





గాయాలపాలైన పురోహితులు

పి.గన్నవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఊరేగింపులో ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలి అమ్మవారి సేవ చేసే పురోహితులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... దసరా ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయిలంకలో, మానేపల్లి సెంటర్‌లో గల అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి పదిగంటల సమయంలో శివాయిలంక ఊరేగింపు సెంటర్‌కి చేరుకోవడంతో కొంతమంది యువకులు జువ్వలు వేస్తున్నారు. అదే సమయంలో సెంటర్‌లో మరక అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్నారు. అవతల ఊరేగింపు నుంచి వచ్చిన జువ్వ ట్రాక్టర్లో పడడంతో ట్రాక్టర్లో ఉన్న జువ్వలకు నిప్పురవ్వలు అంటుకుని ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో ట్రాక్టర్లో అమ్మవారికి సేవచేస్తున్న పురోహితులు రత్నాగోపాల్ (30), వి.విజయప్రసాద్(50)కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆదివారం పోలీసులు, దేవస్థానం అధికారులు పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ఊరేగింపు సమయంలో ఉన్న డీజేను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు సేకరిస్తున్నామని, దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. యువత అజాగ్రత్త ఇద్దరు పురోహితుల ప్రాణాలమీదకు వచ్చిందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

రెండోరోజు బ్రెజిల్ బృందం పర్యటన

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల పరిశీలన



కొవ్వూరు: దొమ్మేరులో పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం



దేవరపల్లి: కురుకూరులో భోభోపంటను పరిశీలిస్తున్న దృశ్యం

కొవ్వూరు/దేవరపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో బ్రెజిల్ బృందం సభ్యులు రెండోరోజు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను పరిశీలించారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం కాపవరం, ధర్మవరం గ్రామాల్లో పర్యటించి పంటల సాగులో అవలంబిస్తున్న విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహబూబ్ వల్లీ మాట్లాడుతూ జర్మనీకి చెందిన రైతులు, ఏజెన్సీ ప్రతినిధులు బ్రెజిల్ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధులు సుమారు 27 మంది డెలిగేట్స్ కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, ధర్మవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారని, రైతులతో మాట్లాడి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలసుకున్నారని పేర్కొన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ సిహెచ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బ్రెజిల్ బంద సభ్యులు దేవరపల్లి మండల కురుకూరు, యర్నగూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ రైతు సాధికారితపై పరిశీలించి రైతులు, అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ఎస్.మాధవరావు, కొవ్వూరు ఏడీఏ శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ అధికారులు మధుసూధనరావు, జాకిర్ హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ తాతారావు, అడిషనల్ జిల్లా మేనేజర్ వల్లి, మండల వ్యవసాయాధికారి కే.కమలరాజు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి సతీశ్, రైతులు గద్దే మునేశ్వరరావు, భాస్కరరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక ఉరేసుకున్న యువకుడు



కృష్ణ (ఫైల్)

కొవ్వూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. వాడపల్లి గ్రామానికి చెందిన అమలాపురం కృష్ణ(25) తాపీపని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 4నెలల క్రితం రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేటు వెహికల్ ఫైనాన్స్‌లో రూ.9000 చెల్లించి ఫైనాన్స్‌పై స్కూటీ కొనుగోలు చేశాడు. మూడు వాయిదాలు చెల్లించకపోవడంతో ఈ నెల 4న ఉదయం ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు ఇంటికొచ్చి వాయిదా సొమ్ము చెల్లించాలని ఒత్తిడి చేశారు. సోమవారం చెల్లిస్తానని చెప్పినప్పటికి ఇబ్బందిపెట్టి సోమవారం చెల్లించని పక్షంలో చంపుతామని బెదిరించారు. దీనిపై మనస్తాపం చెందిన కృష్ణ ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యాన్ ఉక్కుకు టవల్, లుంగీ కలిపి కట్టుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి అమలాపురం సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

గోదావరిలో దూకిన వ్యక్తి

మలికిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన మేడిది సుదర్శనరావు (35) దిండి-చించినాడ వంతెనపై నుంచి దూకేశాడు. బైక్, సెల్‌ఫోన్‌ను వంతెనపై వదిలాడు. ఇది చూసిన స్థానికులు బంధువులకు సమాచారం అందించారు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. మలికిపురం పోలీసులను వివరణ కోరగా ఏ సమాచారం లేదని తెలిపారు.

మస్కట్ నుంచి సురక్షితంగా స్వస్థలానికి...

కోనసీమ మహిళ రాక

అమలాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో ఇంట్లో పనికోసం వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఎస్కేఎం బేబిని సురక్షితంగా స్వస్థలానికి తీసుకువచ్చారు. పిఠాపురానికి చెందిన నాగలక్ష్మి ద్వారా గత మే నెలలో ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లిన బేబికి అక్కడ తలెత్తిన ఇబ్బందుల నేపథ్యంలో కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి జి.రమేష్ సహకారంతో మస్కట్ నుంచి ఆమె స్వస్థలానికి వచ్చినట్టు కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మస్కట్‌లో వంట చేసి ఉపాధి పొందే బేబికి అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోవడంతో బలమైన గాయం తగిలి పనిచేయలేని స్థితిలో ఇబ్బందులు పడుతుంది. అక్కడి నుంచి స్వస్థలానికి రావాలని పనికి కుదుర్చుకున్న యజమాని ఆమెను హవాలా ఆఫీసులో వదిలి వెళ్లాడు. ఆమెను స్వదేశానికి పంపాలంటే ప్రయాణ చార్జీలు చెల్లిస్తేనే గానీ ఇండియాకు పంపడం కుదరదని చెప్పడంతో బాధితురాలు బంధువులు సుమారు రూ.లక్ష సమకూర్చారు. అయితే అవి సరిపోకపోవడంతో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సహాయం కోసం వినతి ఇచ్చారు. దాంతో స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్‌కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు ఆదేశాలు జారీ చేయగా మస్కట్‌లోని హవాలా కార్యాలయంతో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరిపి బేబిని మస్కట్ నుంచి స్వస్థలానికి తీసుకురావడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ల రమేష్‌లు తెలిపారు.



మస్కట్ నుంచి స్వస్థలానికి వచ్చిన బేబితో మాట్లాడుతున్న సమన్వయ అధికారి రమేష్

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.4.43 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

తుని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.43 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ప్రధానాలయం నుంచి స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి సర్వాంగసుందరంగా పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజల అనంతరం చైర్మన్ రోహిత్ టెంకాయి కొట్టి రథసేవను ప్రారంభించారు. పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం మత్తు... కారు, బైక్ చిత్తు!

కారుపైకి దూసుకెళ్లి కూర్చుండిపోయిన యువకుడు

ఆలమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై ఒక యువకుడు రాంగ్ రూట్‌లో బైక్ నడుపుతూ మద్యం మత్తులో అతివేగంగా వస్తున్న కారుపైకి దూసుకెళ్లాడు. బైక్ నేరుగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో కారు ముందు భాగం (బానెట్, బంపర్) తీవ్రంగా దెబ్బతిన్నాయి. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. బైక్ నడుపుతున్న యువకుడు కారు బానెట్‌పై, విండ్‌షీల్డ్ పగిలిన చోట కూర్చుండిపోయాడు. ప్రమాదం జరిగిన సమయంలో యువకుడు మద్యం తాగి ఉన్నాడని స్థానికులు తెలిపారు. రోడ్డుపై వాహనాలు రాకపోకలు నిలిచిపోగా స్థానికులు, ప్రయాణికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఆలమూరు మండలం చొప్పెల్ల హైవేపై బైక్‌తో ఢీకొని కారుపైకి ఎక్కిన యువకుడు

రోలర్ స్కేటింగ్ పోటీలు



రోలర్ స్కేటింగ్ పోటీలకు సిద్ధపడుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్రటరీ, పీడీలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా ఆదివారం తూరంగిలో రోలర్ స్కేటింగ్ పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షణలో నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు, పీడీలు పట్టాభిరామం, శ్రీహరిరాజు, అప్పారావు, రవి, దుర్గాప్రసాద్, హుస్సేన్ పోటీలను పర్యవేక్షించారు.

రేపు ఎన్టీఆర్ బీచ్‌లో వాలీబాల్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలు

అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలు జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటలకు జిల్లా క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ బీచ్ వరకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అండర్-17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు జి.మామిడాడలో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9059317248, 9603504347 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. భవిష్యత్తులో నిత్యాన్నదానం చేసేందుకు చర్యలు చేపడతామని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.







మహారాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, వంశీకృష్ణను మహారాజా కథా పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం, సూర్యరాయ గ్రంథాలయంలో మహారాజా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు రంగాల ప్రముఖులు

ఘనంగా పిఠాపురం మహారాజా జయంతి

» రాజా సేవలకు గుర్తింపుగా కాకినాడ జిల్లాకు ఆయన పేరు పెట్టాలి

» నివాళులర్పించిన ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, కవులు, వివిధ రంగాల ప్రముఖులు

పిఠాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్య సంస్థలకు కోట్లాది రూపాయల విలువైన భూములను దానం చేయడంతో స్థాపించడమే గాక పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన పిఠాపురం మహారాజా పేరును కాకినాడ జిల్లాకు పెట్టడమే ఆయన చేసిన సేవలకు అర్పించే ఘన నివాళి అని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, పలువురు వక్తలు, కవులు, పుర ప్రముఖులు పేర్కొన్నారు. ఆదిత్య విద్యా సంస్థలు, పిఠాపురం మహారాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం మహారాజా రాజా కుమార వెంకట మహీపతి సూర్యారావు బహద్దూర్ 140 జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం మహారాజా కథ, కవితా పురస్కారాలతో వంశీకృష్ణ, కొమ్మవరపు విల్సన్‌రావులను సత్కరించారు. జయంత్సుత్యవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో 330 మంది విజేతలకు బహుమతులు, షీల్డులు అందజేశారు. అంతకు ముందు కోటగుమ్మం సెంటర్లోని మహారాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్.విజయసారధి, కో-ఆర్డినేటర్ వి.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఇన్చార్జిలు శ్రీనివాస్, రేవతి, ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు ర్యాలి ప్రసాద్, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య, సాహితీ రంగాలకు పిఠాపురం మహారాజా చేసిన సేవలు, దాతృత్వం గురించి నేటి యువతరానికి, భవిష్యత్తుతరాలకు తెలియజేద్దామని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మహారాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహారాజా దాతృత్వం, విద్య, వైద్య, సాహితీ రంగాలకు చేసిన సేవలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టే విషయంలో త్వరలోనే జిల్లాకు చెందిన ప్రముఖులతో సమావేశం ఏర్పాటుచేసి కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. మున్సిపల్ విశ్రాంత కమిషనరు వెన్నపు చక్రధరరావు, మన ఊరు-మన బాధ్యత సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, మధు, కాగిత నాగేశ్వరరావు పాల్గొన్నారు. శ్రీసంస్థానం సత్రం ఆవరణలో మహారాజా విగ్రహానికి రాజా రావు రామరత్నారావు, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో రాజా విగ్రహానికి ప్రిన్సిపాల్ వి.కేశవరావు నివాళులర్పించారు.

మహారాజా గొప్ప సంఘ సంస్కర్త

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం మహారాజా రాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ 140వ జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేస్తూ మహారాజా చేసిన సేవలను స్మరించుకున్నారు. తన ప్రజా పరిపాలనతో సంఘసంస్కర్తగా, అభ్యుదయవాదిగా, తెలుగు భాష ఉద్యమకారుడిగా కీర్తి గడించారన్నారు. సూర్యరాయాంధ్ర నిఘంటువును తెలుగు ప్రజలకు అందించిన మార్గదర్శి అని కొనియాడారు.





మహారాజా జయంతి సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నేడు వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. బజాజ్ క్యాపిటల్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్, డెక్కన్ కెమికల్స్, హోండాయ్ మోబీస్, ఇసుజు, పహార్పూర్, ఫాక్స్‌కాన్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరులో సంప్రదించాలన్నారు.

8 నుంచి 14 వరకు ఆధార్ శిబిరాలు

కాకినాడ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు కాకినాడ డివిజన్‌లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. 8, 9 తేదీల్లో పిఠాపురం భాష్యం హైస్కూలు, నీలపల్లి, గిరియాంపేట ఉన్నత పాఠశాలలు, 10, 11 తేదీల్లో ఏలేశ్వరం ఎంపీపీఎస్ ప్రధాన పాఠశాల, గాడిమొగ, సావిత్రినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 13, 14 తేదీల్లో పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాల, డి.పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. ఆధార్ నమోదు సేవలను ఉచితంగా అందిస్తారని... ఆయా ప్రాంతాల ప్రజలు, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కనకదుర్గమ్మ శోభాయాత్ర

గొల్లప్రోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో కనకదుర్గమ్మ శోభాయాత్ర ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. అమ్మవారి నామస్మరణతో పట్టణం మార్మోగింది. కరణం గారి తోటలో నిలిపిన కనకదుర్గమ్మ అమ్మవారిని పూలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించారు. దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బాధ్యతలు చేపట్టిన టౌన్ హాల్ నూతన కమిటీ సభ్యులు

లిటరరీ అసోసియేషన్ టౌన్ హాల్ నూతన కార్యవర్గమిదే

కాకినాడ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లిటరరీ అసోసియేషన్ టౌన్ హాల్ నూతన కమిటీ బాధ్యతలు చేపట్టింది. అధ్యక్షుడిగా వీవీఎన్ సత్యనారాయణ (ఆనంద్), ఉపాధ్యక్షుడిగా డీవీఎన్ రాజు, కార్యదర్శిగా వీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా వైవీఎస్ నాయుడు, కోశాధికారిగా నెక్కంటి శ్రీనివాస్, సభ్యులుగా బచ్చు శేఖర్, పేపకాయల రామకృష్ణ, సీహెచ్ ఇంద్రనీల్, లక్ష్మణ్ కుమార్, దంగేటి ప్రసాద్, మల్లిపూడి రాంబాబు, తాళ్లరేవు వర్మ, పి.శ్రీనివాస్ ప్రమాణం చేశారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది జీవీ కృష్ణప్రకాష్ వ్యవహరించారు. రెండేళ్ల పాటు నూతన కమిటీ కొనసాగుతుంది. పూర్వ కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య మాట్లాడుతూ గత రెండేళ్ల కాలంలో రూ.2.5 కోట్లతో నూతన సమావేశ మందిరం నిర్మాణంతో పాటు గ్రంథాలయ ప్రాంగణాన్ని ఆధునీకరించామన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత కమిటీ సహకారంతో టౌన్ హాల్ గౌరవం ఇనుమడింపజేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు.





కాకినాడలో అమ్మవార్ల విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

వైభవంగా అమ్మవార్ల నిమజ్జనం

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు ముగియడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో పందిళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. గాంధీనగర్, దుర్గానగర్, సాంబమూర్తినగర్, డెయిరీ ఫారం సెంటర్, మధురానగర్, శాంతినగర్‌ల్లో నెలకొల్పిన విగ్రహాలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు రంగులు చల్లుతూ, అమ్మవారికి జేజేలు కొడుతూ ఊరేగించారు. వార్ఫ్ రోడ్డు, కాకినాడ సాగర తీరానికి తరలించి నిమజ్జనం చేశారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల్లో విశేష పూజలందుకున్న దేవి విగ్రహాలను ఆదివారం ఉప్పుటేరు సాగర్‌లో నిమజ్జనం చేశారు. పెద్ద మార్కెట్ ఏరియాలో నిలబెట్టిన అమ్మవారిని ది కాకినాడ మినీ గూడ్స్ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నృత్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం జరిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గదుల సాయిబాబు, అధ్యక్షుడు వెలుగుబంటి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల వీరబాబు, కార్యదర్శి చాట్ల గురుమూర్తి, సంయుక్త కార్యదర్శి మేడసాని రాజా, కోశాధికారి కేవీవీ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఎం.వీరబాబు, పి.రాంబాబు, జి.దుర్గ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

డాక్టర్ 'అమలకంటి'కి 'అన్నపూర్ణ' పురస్కారం

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మను స్ఫూర్తిగా తీసుకుని అందిస్తున్న సేవలకు సామర్లకోట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక సేవాపరాయణుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు 'అన్నపూర్ణ' గౌరవ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆవరణలో శ్రీనివాసరావుకు మహాశాస్తా సేవా ట్రస్టు నిర్వాహకులు మురళీ నంబూద్రి, శివనరసింహన్ తంత్రి, శుభాగాని రాజగురుస్వామి పురస్కారం అందజేసి శాలువా కప్పి జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సత్కరించారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నూతన కార్యవర్గ సభ్యులతో దళిత నాయకులు

ఒంటితాడి వ్యవసాయ కూలీల దళిత సంక్షేమ సంఘం ఏర్పాటు

కాకినాడ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం ఒంటితాడి వ్యవసాయ కూలీల దళిత సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం రిజిస్ట్రేషన్ కాకినాడలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా పువ్వల భైరవమూర్తి, ఉపాధ్యక్షుడిగా దున్నా ఆదినారాయణ, కార్యదర్శిగా దండంగి సమర్పణరావు, సంయుక్త కార్యదర్శిగా పువ్వల తణుకులు, కోశాధికారిగా పువ్వల ఆనందరావు, గౌరవాధ్యక్షుడిగా బిల్లా కొండలరావు, ఆరుగురు సభ్యులతో సంఘం ఏర్పాటైంది. జై భీమ్‌రావు భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు పొందడానికి సంఘం కృషి చేయాలని సూచించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణమూర్తి, బహుజన ఆర్మీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోని సంజయ్ కుమార్, సంఘ సభ్యులు దండంగి సత్యనారాయణ, పువ్వల భైరవమూర్తి, కుండ లోవరాజు, బిల్లా శివశంకర్, కమిడి విజయ్‌కుమార్, దండంగి సత్తిబాబు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు

'అమృత మంజరి-2' పుస్తకావిష్కరణ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకే దేవుడు-ఒకే దేశం నినాదంతో మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో అమృత మంజరి-2 (తన ప్రేమగల చేతుల నైపుణ్యం) ఆధ్యాత్మిక పుస్తకాన్ని కాకినాడ ఐఎంఏ భవనంలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావం, స్నేహతత్వం, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు మనుజ్యోతి సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. భగవంతుడు ఒక్కడే అని చైతన్యం తీసుకువచ్చేలా వేద గ్రంథాలు, పురాణంలోని సారాంశాలను పుస్తకాలుగా ముద్రించి మనుజ్యోతి సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నట్టు కార్యక్రమ నిర్వాహకుడు కేవీఆర్ఎల్ ప్రభాకరరావు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు కేవీ రమణ, జె.రామారావు, జి.రాంబాబు, ఐఎస్ మూర్తి, ఓఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ భీమేశ్వర క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట లయన్స్ భీమేశ్వర క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని లయన్స్ మొదటి గవర్నర్ చిట్టీడి శ్రీనివాసు, డాక్టర్ వెంకటభార్గవ్ ప్రారంభించారు. లయన్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్, సామర్లకోట లయన్స్ క్లబ్, కైరా ఎమర్జెన్సీ ట్రామా కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ టి.వెంకటభార్గవ్, డాక్టర్ కర్రి నిరూప, డాక్టర్ సీహెచ్ అజయ్ రాకేష్, డాక్టర్ నంబూరు స్నేహ, డాక్టర్ ఆశారమ్య, సిబ్బంది 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బడుగు సీతారామరాజు, బుర్రే కృష్ణ మోహన్, చిత్తులూరి వీర్రాజు, ఈదల ఈశ్వరకుమార్, కర్రి ఆదినారాయణరెడ్డి, సేపేని సురేష్‌రూప, గిడుతూరి శ్రీనివాసరావు, రమేష్ సేవలందించారు.



ప్రదర్శన ఇస్తున్న సీతారత్న లలిత కళా నృత్యనికేతన్ కళాకారులు

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సర్పవరం జంక్షన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లోని శిల్పారామంలో ఏవో మోహన్‌తేజ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జగ్గంపేటకు చెందిన శ్రీసీతారత్న లలిత కళా నృత్యనికేతన్ నిర్వాహకురాలు ముళ్లపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. కేంద్ర హస్తకళల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గాంధీ శిల్ప బజార్‌ని తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'పార్లమెంటులో ఆమోదించిన వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి'



ఐక్యత చాటుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

కాకినాడ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోస్టల్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. అధ్యక్షుడిగా పి.మహేశ్వరరావు, కన్వీనర్‌గా డాక్టర్ తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శిగా డీఎల్ఎన్ శాస్త్రి ఏకగ్రీవంగా బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పార్లమెంటులో ఆమోదించిన వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ వేతన సంఘం సిఫార్సులను రిటైర్ అయిన పెన్షనర్లకు వర్తింపజేయాలని, కాకినాడలో సీజీహెచ్ఎస్ హాస్పిటల్ వెల్‌నెస్ సెంటరు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ పెన్షనర్స్ సమస్యలపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మెమోరాండం అందజేయాలని నిర్ణయించారు. నాయకులు సీహెచ్ రామారావు, కె.ప్రసాదరావు, దాట్ల నరసింహరాజు, డీవీఎస్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భావితరాలకు మార్గదర్శకులు గురువులు'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు, మెరుగైన సమాజం నిర్మాణానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తారని, వారిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఏపీఎస్పీ హైస్కూలు హెచ్ఎం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.గాయత్రి, సహచర ఉపాధ్యాయులు ఎం.రామలక్ష్మి, పాల్‌రాజు, విజయలక్ష్మి, వర్ధనమ్మ, నాగమణిలను ఘనంగా సత్కరించారు. ప్రసాద్‌నాయుడు, గరికపర్తి ఓంనమశ్శివాయ, కుమార్‌యాదవ్, పార్థసారధి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులో రూ.6.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చినరాజప్ప ఆదివారం శ్రీకారం చుట్టారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, దేవళ్ళ జయలక్ష్మి, మర్రి శేషారావు, అందుగుల జార్జిచక్రవర్తి, బొండల రామలక్ష్మి, గొలితి సత్యనారాయణ, మహంకాళి వెంకటగణేష్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రతిభ విద్యా సంస్థల ఆవరణలో ఆదివారం సాయంత్రం వేడుకలు నిర్వహించారు. పెద్దాపురం ఖండ్ సంఘ్ సంచాలక్ బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, చదరం నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎస్వీవీ గంగాప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘ్ ప్రముఖులు ప్రసంగించారు. శారీరిక్ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 50 మంది గణ్వేష్‌ధారి స్వయంసేవక్‌లు, 200 మంది ప్రజలు పాల్గొన్నారు.

పిల్లా చంద్రంకు మరో గౌరవ డాక్టరేట్

25న హోసూరులో ప్రదానం



గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రంకు మరో గౌరవ డాక్టరేట్ లభించింది. చంద్రం తన అసోసియేషన్ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్టు నీతి ఆయోగ్ ద్వారా గుర్తింపు పొందిన ఆసియా అంతర్జాతీయ సంస్కృతి పరిశోధనా విశ్వవిద్యాలయం సమాచారం ఇచ్చింది. కర్నాటక రాష్ట్రంలోని హోసూరులో ఈ నెల 25వ తేదీన జరిగే కార్యక్రమంలో చంద్రానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా చంద్రానికి పలువురు అభినందనలు తెలిపారు.



పిఠాపురంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు

31న పిఠాపురంలో మంద కృష్ణ మాదిగ సభ

పిఠాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలు సాగించిన పోరాటం ఫలించి నేడు ఫలాలు అందుకుంటున్నామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో ఆదివారం రాత్రి జరిగిన కాకినాడ జిల్లా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 31న మంద కృష్ణమాదిగ పిఠాపురం నియోజకవర్గానికి వస్తారని, ఇక్కడ జరిగే సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరుతూ అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు అనంతపు రాజు, వల్లూరి సత్తిబాబు, ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన సలహాదారు డాక్టర్ దూళ్లపల్లి సుబ్బారావు, నాయకులు సూరిపాక వాసుదేవరావు, పసుపులేటి చిన్నిబాబు, కాకాడ నూకరాజు, డోకుబుర్ర భద్రం, చాట్ల ఆశీర్వాదం, పలివెల నవీన్, బుల్లి అప్పారావు, దేవరపు సురేష్, వీరవెంకటరమణ, పలివెల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

సామర్లకోట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రతిభ విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. పెద్దాపురం ఖండ్ సంఘ్ సంచాలక్ బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, చదరం నరసిం హారావు ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎస్వీవీ గంగాప్రకాష్ ముఖ్య అతి థిగా హాజరయ్యారు. సంఘ్ ప్ర ముఖులు ప్రసంగించారు. శారీరిక్ ప్రద ర్శన నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వైభవంగా కనకదుర్గమ్మ నిమజ్జనం





మోతుగూడెంలో దుర్గమ్మ ఊరేగింపు, వీఆర్ పురంలో హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

వీఆర్ పురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలో కనకదుర్గమ్మ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. వీఆర్ పురంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంపై పురవీధుల్లో కోలాహలంగా ఊరేగించి పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. అలాగే వడ్డిగూడెం కానీ, రేఖపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ సంతోష్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వై.రామవరం: వై.రామవరంలో డొక్కా వీధిలోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి అమ్మవారి ఊరేగింపు జరిపారు. మహిళలు వేపాకులు పట్టి నృత్యాలు ప్రదర్శించారు. భజన కీర్తనలతో ట్రాక్టర్లపై పలు గ్రామాల్లో ఊరేగించగా భక్తులు పూజలు చేశారు.

మోతుగూడెం: మోతుగూడెంలో దుర్గమ్మ ఆలయంలో ప్రధానార్చకుడు శ్రీనివాస్ పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వాహనాలపై నృత్యాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు వేషధారాలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సీలేరు నదిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, జెన్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంటెంట్ వరప్రసాద్, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ సభ్యులు జాజుల రత్నాకర్ చంద్రశేఖర్, కొట్టు శ్రీనివాసరావు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆదికర్మ యోగితో గ్రామాల అభివృద్ధి

టీడీపీ రాజవొమ్మంగి అధ్యక్షుడు పెద్దిరాజు



రాజవొమ్మంగి అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. ఆదివారం రాజవొమ్మంగిలో పెద్దిరాజు మాట్లాడుతూ.. ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజవొమ్మంగి మండలంలో మొదటి విడతలో 14 గ్రామాల్లో చేయవలసిన పనులను గుర్తించారని, రెండో విడతలో 37గ్రామాల్లో అధికారులు పర్యటించి గ్రామసభలు నిర్వహించనున్నారని పెద్దిరాజు అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం చేసే ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామంలోకి వచ్చినప్పుడు కూటమి నాయకులు, కార్యకర్తలు సహకరించాలన్నారు.

వై.రామవరం: మండలంలో లోతట్టున ఉన్న యార్లగడ్డ పంచాయతీలో రెండో విడతలో ఎంపికైన శేషరాయి గ్రామంలో అధికార్మయోగి అభియాన్ నిర్వహించారు. గ్రామంలో అవసరమైన పనులను గుర్తించారు.గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల పద్మావతి, పల్లాల రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

వీఆర్ పురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులకు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అమెరికా గ్లోబల్ మున్నూరు కాపు అధ్యక్షుడు సంఘాని రజనీకాంత్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్, జర్నలిస్ట్ ఫోరమ్ ప్రెసిడెంట్ కె.లక్ష్మణ్‌పటేల్ అన్నారు. ఆదివారం వారు భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వీఆర్ పురంలో మున్నూరు కాపు సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తూర్పు కాపు, కాపు కులాలకు బీసీ కార్పొరేషన్ ఉన్నట్లుగానే తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాల్లోని మున్నూరు కాపు కులస్థులకు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు ప్రసాద్, మాదిరెడ్డి ధర్మారావు, కోలా రాము, కర్నాటి ఏసు, కత్తాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ చింతూరు మండలాధ్యక్షుడు జమాల్‌ఖాన్



కుమ్మూరు కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు జమాల్‌ఖాన్

చింతూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ మండలాధ్యక్షుడు జమాల్ ఖాన్ అన్నారు. కుమ్మూరు గ్రామంలో టీడీపీ నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, సురక్షిత నీరు, అంగన్వాడీ భవనం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు కోరారు. అలాగే ఇటీవల వరదల కారణంగా పంటలు మునిగిపోయాయని నష్ట పరిహారంతో పాటు వంగడాలను ఉచితంగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం పరిహారం, పునరావాసం వేగంగా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జహంగీర్, చిన్నారెడ్డి, సాల్మన్‌రాజు, నర్సింహరావు, అనిగి చంద్రయ్య, పొడియం రామకృష్ణ, రమేష్, శ్యామలజయ, భాస్కర్, కుర్సం నాగిరెడ్డి, హరిబాబు, అనిగి రాజు, బుచ్చిరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక ఊతం



పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎటపాక, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు ఆర్థికంగా ఊతం అందించేందుకు ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించినట్టు టీడీపీ నాయకుడు బొల్లా పుల్లయ్య, నిడదవోలు సూర్యనారాయణ అన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం నిధులు డ్రైవర్ల ఖాతాలో రూ.15 వేలు జమకావడంతో ఆదివారం గన్నవరం గ్రామంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. థ్యాంకూ బాబూ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏసుపాక వెంకట్, కొత్తపల్లి రాజశేకర్, గొళ్లపల్లి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల సంఘం బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి, పాల్గొన్న పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు

జగ్గంపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం పనితీరు ప్రజాస్వామ్యాన్ని బలోపే తం చేసే దిశగా ఉండాలని జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం జగ్గంపేట శ్రీస్వామి వివేకానంద విద్యా సంస్థల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఒమ్మి రఘురామ్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ప్రజాసదస్సుకు ప్రధాన ఉపన్యాసకులుగా ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఆయు పట్టు అన్నారు. ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కోర్ కమిటీ సభ్యుడు లోక్ నాథ్, సంస్థ ప్రధాన కార్యదర్శి సుందరపల్లి గోపాలకృష్ణ, కోర్ కమిటీ సభ్యులు ప్రసంగి ఆదినారాయణ, సాహిత్య విభాగ రాష్ట్ర కార్యదర్శి సన్యాసిరావు, జేఎన్టీయూ ప్రొఫెసర్ అబ్బాయి, ప్రొఫెసర్ కృష్ణ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు డేగల రమేష్, జిల్లా కోశాధికారి సునీల్, జిల్లా మాజీ అధ్యక్షులు పప్పు దుర్గా రమేష్, సతీష్, కాకినాడ పట్టణ అధ్యక్షుడు కడియాల నాగరాజు, జగ్గంపేట మండలాధ్యక్షుడు నీలపల్లి అప్పారావు, కిర్లంపూడి మండలాధ్యక్షుడు కర్రి నారాయణమూర్తి, గోకవరం మండలాధ్యక్షుడు నరాలశెట్టి నరసయ్య, గండేపల్లి మండలాధ్యక్షుడు కొట్టు శివరామకృష్ణ, పులి ప్రసాద్, జుత్తుక నాగేశ్వరరావు, ఐక్యవేదిక బాధ్యులు అప్పికొండ రమణ, కిలపర్తి వీరబాబు, రెడ్డి భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



రౌతులపూడి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కుటుంబానికి తోటి విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. మూలగపూడిలో కాపారపు విలయం ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రసాద్‌తో పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితులు రూ.38వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నేడు వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. బజాజ్ క్యాపిటల్, ఐ సాన్ ఎక్స్‌పీరియన్స్, డెక్కన్ కెమికల్స్, హోం డాయ్ మోబీస్, ఇసుజు, పహార్పూర్, ఫాక్స్ కాన్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవ త్సరాల్లోపు అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వా రికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ. 12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇ న్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు సోమవా రం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్ లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరులో సంప్ర దించాలన్నారు.

31న పిఠాపురంలో మందకృష్ణ మాదిగ సభ

పిఠాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆ ధ్వర్యంలో మూడు దశాబ్దాలు సాగించిన పోరా టం ఫలించి నేడు ఫలాలు అందుకుంటున్నామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు పేర్కొ న్నారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో ఆదివారం రాత్రి జరిగిన కాకినాడ జిల్లా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 31న మంద కృష్ణమాదిగ పిఠాపురం నియోజకవర్గానికి వస్తారని, ఇక్కడ జరిగే సభలో పాల్గొంటారని తెలిపారు. ఈసభను విజయవంతం చేయాలని కోరుతూ అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ధర్మవరంలో సంపూర్ణ పారిశుధ్యం



ధర్మవరంలో రోడ్డు ప్రక్కన చెత్త తీస్తున్న పారిశుధ్యం కార్మికులు, చెత్త తీసిన తర్వాత దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):ధర్మవరం గ్రామం సంపూర్ణ పారిశుధ్యం దిశగా అడుగులు వేస్తోంది. గ్రామంలో రోజు 6టన్నుల పైబడి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరు చేసి పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, తడి చెత్తను సంపద కేంద్రం ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. గ్రామంలోని 16వార్డుల్లో చెత్త సేకరణకు రెండు ట్రాక్టర్లు, ఒక వ్యాన్‌ను ఉపయోగిస్తున్నారు. ముగ్గురు డ్రైవర్లు, 12మంది పారిశుధ్య సిబ్బంది చెత్తను పూర్తిగా తొలగించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా గ్రామంలో ఉన్న 3సచివాలయాల్లో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నారు. చెత్తసేకరణపై ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు.

గుంతల రహదారి.. ప్రజల ఇబ్బందులు



గోతులమయంగా ఉన్న అచ్చంపేట రోడ్డు

శంఖవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతంగి కొత్తూరు నుంచి అచ్చంపేట, గొంది కొత్తపల్లి వెళ్లే రోడ్డు భారీ గుంతలతో అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గుంతలు కారణంగా ఈ రోడ్డులో ఆటోలు కూడా తిరగడం మానేశాయి. దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని నిర్మించి ఇబ్బందులను తొలగించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. భవిష్యత్తులో నిత్యాన్నదానం చేసేందుకు చర్యలు చేపడతామని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్'

ప్రత్తిపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైసీపీ అధిష్ఠానం డిజిటల్ బుక్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆ పార్టీ నాయకులు చెప్పారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం వైసీపీ నాయకులు డిజిటల్ యాప్, క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు బెహరా దొరబాబు, రామిశెట్టి నాని, పినిశెట్టి ప్రకాష్, మదినే నూకరాజు, ఏడిద రెడ్డి నాయుడు, జువ్వల చినబాబు, బాబులు, ముమ్మిడి అప్పన్న, దొరబాబు పాల్గొన్నారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, కార్యకర్తల రక్షణ కోసం వైసీపీ అధినేత జగన్ డిజిటల్ బుక్‌ను తీసుకు వచ్చారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జేమీలు, జడ్పీటీసీ గొల్లు చినదివాణం అన్నారు. కేదారశెట్టి నాగేశ్వరరావు రైస్ మిల్లు వద్ద మండలాధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్ సర్నం శ్రీను, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ జడ్పీటీసీ చెన్నాడ సత్తిబాబు, గొల్లు వెంకటరమణ, అంకంరెడ్డి సతీష్ కుమార్, అచ్చింత సాంబ పాల్గొన్నారు.

8నుంచి 14వరకు ఆధార్ శిబిరాలు

కాకినాడ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు కాకినాడ డివిజన్‌లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. 8, 9 తేదీల్లో పిఠాపురం బాష్యం హైస్కూలు, నీలపల్లి, గిరియాంపేట ఉన్నత పాఠశాలలు, 10, 11 తేదీల్లో ఏలేశ్వరం ఎంపీపీఎస్ ప్రధాన పాఠశాల, గాడిమొగ, సావిత్రినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 13, 14 తేదీల్లో పెద్దా పురం లూథరన్ ఉన్నత పాఠశాల, డి.పోల వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిబిరా లు జరుగుతాయన్నారు. ఆధార్ నమోదు సేవలను ఉచితంగా అందిస్తారని... ఆయా ప్రాంతాల ప్రజలు, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులో రూ.6.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చినరాజప్ప ఆదివారం శ్రీకారం చుట్టారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, దేవళ్ళ జయలక్ష్మి, మర్రి శేషారావు, అందుగుల జార్జిచక్రవర్తి, బొందల రామలక్ష్మి, గొలితి సత్యనారాయణ, మహంకాళి వెంకటగణేష్ పాల్గొన్నారు.

అదృశ్యమైన యువతి గుర్తింపు

గండేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యంపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనిపై గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు, జగ్గంపేట సీఐ వైఆర్ కేశ్రీనివాస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. యువతి నెల్లూరులో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను అక్కడి నుంచి గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి తల్లిదండ్రులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

మురారి దుర్గమ్మ ఆలయంలో సందడి

గండేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మురారి గ్రామ శివారున ఉన్న మామిడితోటలో కనకదుర్గమ్మ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తజనం మొక్కులు చెల్లించుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కొండయ్యాచౌదరి

రైతుల సలహాలతో పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా

గండేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రైతుల సలహాలు తీసుకుని జగ్గంపేట పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో తీసుకు వెళతానని పీఏసీఎస్ అధ్యక్షుడు కందుల కొండయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఆయన జడ్.రాగంపేట పీఏసీఎస్ ఆవరణలో రైతులు, అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి పలు సలహాలు తీసుకుని పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఖరీఫ్ సాగులో ఉందని, తొందరలో రబీ వస్తుందని రైతులకు పీఏసీఎస్ నుంచి కావల్సిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యూరియా కొరత ఎదుర్కొన్నప్పటికీ పూర్తిస్థాయిలో అందించామన్నారు. రబీలో యూరియా కొరత లేకుండా ముందుగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతుల సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు వైబోగుల వెంకటేశులు, మద్దుపూడి రాంబాబు, సీఈవో మూతిన సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఖండ ప్రముఖ్ సూర్యనారాయణ. పక్క చిత్రంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆర్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

ఏలేశ్వరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం ఖండ సేవా నేతృత్వంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దేశం కోసం పని చేసే హిందువుల కోసం ప్రతీ గ్రామంలో ఇంటింటికీ సంఘ్‌ను విస్తృతం చేయడమే ఖండ లక్ష్యమని జిల్లా ఖండ ప్రముఖ్ సేవా సూర్యనారాయణ అన్నారు. పట్టణ వీధుల్లో ఆర్ఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచారు. ఏలేశ్వరం మండల ఖండ సేవా ప్రముఖ్ ఏనుగు సుబ్రహ్మణ్యం, న్యాయవాది చిట్టంశెట్టి పుల్లయ్య, తోట రాఘవులు, గోళ్ల విజయబాబు, గొల్లపూడి సత్యన్నారాయణ, గుర్రం లోవరాజు, గొల్లపూడి గణేష్, ముద్రగత వీరేంద్ర, మజ్జి జగదీష్, పిన్నం శివ రామకృష్ణ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

స్థానిక కోనేటి పాఠశాల వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆవిష్కరించారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అలమండ దుర్గా వెంకట ప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య, ఆర్ఎస్ఎస్ ఖండ ప్రముఖులు పూలమాలలు వేసి ప్రారంభించారు. బోద చిరంజీవి, గెట్టిం వెంకటరమణ, కటకం కిరీటి, కందుల ప్రభాకర్ చౌదరి, హరిబాబు, ఛింశెట్టి పుల్లయ్య, గోళ్ల విజయబాబు, ఆనంద్ పాల్గొన్నారు.

ధర్మవరంలో జెండా ఆవిష్కరణ

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని ధర్మవరంలో ఆ సంఘ కార్యకర్తలు ఆదివారం ఆర్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ ముక్కు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ ధర్మం, దేశం కోసం పని చేసే హిందువులను కలపడానికి ఇంటింటికి సంఘాన్ని పరిచయం చేయాలనే పలు కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సింగిలిదేవ్ సత్తిరాజు, దొడ్డిపట్ల సోమన్నదొర, చుక్కల సత్యనారాయణ, దాడి చిన్నారావు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చిత్రా అప్పారావు, నక్కా శ్రీనివాసరావు, రామకుర్తి రాజబాబు, తటవర్తి రామన్న దొర పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

డాక్టర్ 'అమలకంటి'కి 'అన్నపూర్ణ' పురస్కారం

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మను స్ఫూర్తిగా తీసుకుని అందిస్తున్న సేవలకు సామర్లకోట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక సేవాపరాయణుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు 'అన్నపూర్ణ' గౌరవ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆవరణలో శ్రీనివాసరావు కు మహాశాస్తా సేవా ట్రస్టు నిర్వాహకులు మురళీ నంబూద్రి, శివనరసింహన్ తంత్రి, శుభాగాని రాజగురుస్వామి పురస్కారం అందజేసి శాలువా కప్పి జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సత్కరించారు.

ఏలేరు కాలువలో ఇసుక అక్రమ తవ్వకాలు?

జగ్గంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం సోమవారం గ్రామం నుంచి కృష్ణవరం, గోనాడ, తామరాడ, రామచంద్రపురంతో పాటు పెద్దాపురం మండలం లోపలి గ్రామాలతో కలిపి ప్రధాన కాలువ ఉంది. ఈ కాల్వ వెంబడి ఉన్న జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న సోమవరం అనే గ్రామంలో రైతుల పొలాల వెంబడి బాటలు వేశారు. అక్కడి నుంచి నేరుగా ఏలేరు నదిలోకి చేరుకుని అక్కడ ఇసుకను యంత్రాల ద్వారా కాల్వ నుంచి తవ్వి భారీ వాహనాలకు లోడింగ్ చేస్తున్నట్టు తెలిసింది. ఈ ఇసుకను విశాఖ జిల్లాతో పాటు కాకినాడ, రాజమండ్రి వంటి ప్రాంతాలకు నిత్యం వందలాది లారీలతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు స్థానిక రైతుల ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే మాది రిగా తవ్వకాలు చేయడంతో కాలువ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. దీనివల్ల పంటలు పండే పొలాలు పూర్తిగా పాడవుతున్నాయి. అంతేకాక రోజూ లక్షలు విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలించేస్తు న్నారని ఏటిగట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక లారీ వచ్చి సుమారుగా రూ.18 నుంచి 20 వేల వరకు అమ్మకాలు చేస్తున్నారని దీనిపై అధికారులను అడిగినప్పటికీ ఇసుక అక్రమ రవాణా తమ దృష్టికి రాలేదంటూ దాటవేస్తున్నట్లు దిగువస్థాయి సిబ్బందితో పాటు మండల స్థాయి సిబ్బంది, అధికారులు తప్పిం చుకు తిరుగుతున్నారు. జగ్గంపేట మండలంలో ఒక కాంట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారని సోమవరం, కృష్ణవరం గ్రామానికి చెందిన రైతులు ఆరోపిస్తు న్నారు. ఇసుక అక్రమ తరలింపు దళారులకు కాసులు కురిపిస్తోందని పలువురు రైతులు, స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం